## క్లుప్తంగా

### అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను సింహాసనంపై వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమం నిర్వహించారు. విష్వక్సేణ పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అర్చకులు అందజేశారు.

### దోమల నివారణకు గంబూసియా చేపలు



మురుగు కాలువలో గంబూసియా చేపలను వదులుతున్న సర్పంచ్ దేవి వెంకటరమణ

**పరవాడ:** తానాం గ్రామంలో దోమల నివారణకు చర్యలు చేపట్టడడం జరిగిందని సర్పంచ్ కన్నూరిదేవి వెంకటరమణ చెప్పారు. గ్రామంలో దోమలు సంచరిస్తున్న మురుగు కాలువలు, నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి దోమల నిర్మూలనకు గంబూసియా చేపలను విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో పరవాడ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పైల జగన్నాధరావు, ఉప సర్పంచ్ వర్రి వరలక్ష్మి వసంతరావు, రొంగలి అప్పారావు, సన్యాసిరావు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### సంచార జాతుల సమస్యల పరిష్కారానికి కృషి



ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు

**సబ్బవరం:** సంచార జాతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు తెలిపారు. స్థానిక సీతారామ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన సంచార జాతుల 72వ విముక్తి దినోత్సవ సభలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. సంచారజాతులైన బేడ, బుడగ జంగాల, గంగిరెద్దుల కులాల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బీసీ డిక్లరేషన్ కూడా అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. జనాభా ప్రాతిపదికన నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ దెద్దం ప్రసాదరావు, ఎంపీటీసీ గొర్లి చైతన్య, బంతికోళ్ల పద్మ, గండి దేముడు తదితరులు పాల్గొన్నారు.

### పలు రైళ్ల రీ షెడ్యూల్



**తాటిచెట్లపాలెం :** వాల్తేర్ డివిజన్ పూండి - నౌపడ, తిలారు–కొటబొమ్మాళి సెక్షన్ పరిధిలో జరుగుతున్న భద్రతాపరమైన ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు ఆయా తేదీల్లో రీ షెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

- పుదుచ్చేరిలో ఈ నెల 4న సాయంత్రం 6.50 గంటలకు బయల్దేరాల్సిన పుదుచ్చేరి - భువనేశ్వర్(12897) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు 3 గంటలు ఆలస్యంగా రాత్రి 9.35 గంటలకు బయల్దేరుతుంది.
- కేఎస్ఆర్ బెంగళూరులో ఈ నెల 4, 6న మధ్యాహ్నం 1.30 గంటలకు బయల్దేరాల్సిన కేఎస్ఆర్ బెంగళూరు - భువనేశ్వర్ (18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటలు ఆలస్యంగా సాయంత్రం 4.10 గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 5 నుంచి 7 వరకు విశాఖపట్నం - పలాస - విశాఖపట్నం (07470 / 07471) మెము శ్రీకాకుళం రోడ్ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తుంది. ఆయా తేదీల్లో ఈ రైలు శ్రీకాకుళం రోడ్ - పలాస మధ్య రాకపోకలు సాగించదు.



# వదలని వాన

- రహదారులు జలమయం
- ముత్యాలమ్మపాలెం తీరంలో ఎగసిపడుతున్న అలలు
- నిలిచిన చేపల వేట
- ఇళ్లకే పరిమితమైన గంగపుత్రులు



ముత్యాలమ్మపాలెంలో తీరాన్ని తాకుతున్న అలలు

**పరవాడ:** వాన వదలడం లేదు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వాయుగుండంగా మారడంతో ముత్యాలమ్మపాలెం తీరంలో సముద్రపు అలలు ఎగసిపడుతున్నాయి. ఉధృతంగా తీరాన్ని తాకుతున్నాయి. తీరం అల్లకల్లోలంగా ఉండటంతో రెవెన్యూ అధికారుల ఆదేశాలతో మత్స్యకారులు మూడు రోజులుగా చేపల వేటను మానుకుని ఇళ్లకే పరిమితమయ్యారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పడవలు, వలలు, ఇంజిన్లను సురక్షిత ప్రాంతాల్లో భద్రపర్చుకున్నారు. తీరం వెంబడి ఓ మోస్తరు ఈదురుగాలులు వీస్తున్నాయి.

**పొంగుతున్న గెడ్డలు, వాగులు**

మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గెడ్డలు, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. శనివారం మధ్యాహ్నం నుంచి ఏకధాటిగా కురిసిన వర్షంతో చెరువుల్లో నీరు చేరింది. పరవాడ, రావాడ ప్రాంతాల్లో పూర్తయిన వరినాట్లకు ఈ వర్షం బాగా ఉపయోగపడింది. తానాం, భర్నికం, కలపాక గ్రామాల్లో వరి నాట్లు వేయడంలో రైతాంగం నిమగ్నమై ఉంది. మండలంలో 134 హెక్టార్లలో వరినాట్లు వేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 74 హెక్టార్లలో పూర్తయ్యాయి. మూడు రోజులుగా మండలంలో 64.02 మి.మీ. వర్షపాతం నమోదైందని వ్యవసాయాధికారి సీహెచ్.చంద్రావతి చెప్పారు. ప్రస్తుత వర్షాల వలన విద్యుత్ సరఫరాలో కొంత అవరోధం కలిగినా విద్యుత్ సంస్థకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని పరవాడ సెక్షన్ ఏఈ శేషసాయి తెలిపారు.



ఎన్టీపీసీ రోడ్డులో కురుస్తున్న వర్షం



రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

## వాడచీపురుపల్లికి బస్సు పునరుద్ధరణకు వినతి

**పరవాడ:** విశాఖ ఆర్టీసీ డిపో నుంచి వాడచీపురుపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని పరవాడ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు కోరారు. డిపో మేనేజర్ చటర్జీని శనివారం కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ డిపో నుంచి గ్రామానికి నడుపుతున్న ఆర్టీసీ బస్సులను రద్దు చేయడం వలన కూరగాయల రైతులు, ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, రద్దు చేసిన బస్సులను పునరుద్ధరిస్తామని డిపో మేనేజర్ చటర్జీ హామీ ఇచ్చారని అప్పలనాయుడు చెప్పారు. డీఎంను కలిసిన వారిలో వాడచీపురుపల్లి, నాయుడుపాలెం సర్పంచులు శివలంక లక్ష్మి, కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య, ఉప సర్పంచ్ కూండ్రపు శ్రీను, గౌతమ్, కొమ్మ్మాజిరాజు ఉన్నారు.



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎంపీపీ అప్పలనాయుడు

## పింఛన్ల పంపిణీ కలెక్టర్ పరిశీలన



బాటజంగాలపాలెంలో పింఛన్లు అందజేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

**సబ్బవరం:** మండలంలో శనివారం నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ విజయకృష్ణన్ పరిశీలించారు. బాటజంగాలపాలెంలో పింఛన్ల పంపిణీ జరుగుతున్న తీరును ఆమె పరిశీలించి, పలువురు లబ్ధిదారులకు పెన్షన్ సొమ్ము అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తొలిరోజే నూరు శాతం పింఛన్లు పంపిణీ పూర్తయ్యేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు సిబ్బందికి పలు సూచనలిచ్చారు. మండలంలో 8,206 సామాజిక పింఛన్లకు గాను 7,915 మందికి పింఛన్లు పంపిణీ చేశామని, 96.45 శాతం పూర్తి చేసి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచామని ఎంపీడీవో రమేష్ నాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మహేష్, సర్పంచ్ పడాల వెంకటరమణ, వెలుగు ఏపీఎం సాయిరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏవో బాబూరావు సేవలు ఆదర్శనీయం



బాబూరావు దంపతులను సత్కరిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి తదితరులు

**సబ్బవరం:** మండల పరిషత్ ఏవోగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన షేక్ బాబూరావు సేవలు ఆదర్శనీయమని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉద్యోగులు శనివారం షేక్ బాబూరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథి సూర్యకుమారి, ఎంపీడీవో రమేష్‌నాయుడు మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరి అంచెలంచెలగా సీనియర్ అసిస్టెంట్‌గా, సూపరింటెండెంట్‌గా, పరిపాలనా అధికారిగా బాబూరావు సబ్బవరం ప్రజలకు సేవలందించారన్నారు. ఆయన 36 ఏళ్ల ఉద్యోగ జీవితంలో తోటి, కిందిస్థాయి ఉద్యోగులను ప్రోత్సహిస్తూ సమర్థవంతంగా సేవలందించారని కొనియాడారు. ఉద్యోగ సంఘ నేతగా చురుకైన సేవలను అందించారన్నారు. అనంతరం ఏవో దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ-2 చొక్కాకుల గోవింద్, ఈవోపీఆర్డీ మహేష్, మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, పంచాయతీరాజ్ ఏఈ అర్జున అప్పారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి, బోను గంగునాయుడు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## '32 నృసింహ రూపాల చిత్రమాలిక' ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అశోక్ గజపతిరాజు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలోని బేడా మండపంలో ఉన్న 32 నృసింహ రూపాల చిత్రమాలికను శనివారం సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు విజయనగరంలో ఆవిష్కరించారు. స్వామివారి ఆలయ బేడా మండపంలో ఒక్కో స్తంభంపై ఒక్కో నృసింహ రూపం చెక్కి ఉంది. మొత్తం 32 నృసింహ రూపాలు దర్శనమిస్తాయి. వాటిని పెయింటింగ్ రూపంలో వేసి విశాఖకు చెందిన కేతినీడి సత్యచంద్ర సాయికుమార్ పుస్తకంగా తయారు చేశారు. దాన్ని అశోక్ గజపతిరాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతి, దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో ఆనంద్‌కుమార్, వైదికులు పాల్గొన్నారు.

## సబ్బవరం సీఐ, ఎస్ఐలకు రివార్డు

**సబ్బవరం:** సబ్బవరం సీఐ పిన్నంటి రమణతో పాటు ఎస్ఐ ధనుంజయ్‌కు అనకాపల్లి ఎస్పీ దీపిక శనివారం రివార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. సబ్బవరం మండలంలో 5 రోజుల కిందట పెద్ద ఎత్తున 912 కిలోల గంజాయి పట్టుకున్న కేసులో రివార్డు, ప్రశంసా పత్రాలను అందించినట్లు సీఐ తెలిపారు. అనకాపల్లిలో శనివానం నిర్వహించిన క్రైం మీటింగ్‌లో ఆమె చేతుల మీదుగా వీటిని అందుకున్నామన్నారు. తమతోపాటు కానిస్టేబుల్ నాగేంద్ర, డ్రైవర్ నాయుడులకు ప్రశంసా పత్రాలు అందజేసినట్లు సీఐ చెప్పారు.




ఎస్పీ దీపిక నుంచి రివార్డు, ప్రశంసా పత్రాలను అందుకుంటున్న సీఐ పిన్నంటి రమణ

## వాతావరణ మార్పులపై పెయింటింగ్ పోటీలు

**సీతంపేట:** లంకపల్లి బుల్లయ్య కళాశాలలో వాతావరణ మార్పు అనే అంశంపై స్టూడెంట్ సొసైటీ ఫర్ క్లైమేట్ చేంజ్ ఎన్జీవో సంస్థ, సీడ్స్ ఆఫ్ పీస్ అనే యూఎస్ సంస్థతో కలిసి రెండు రోజులపాటు ఆర్ట్ ఎగ్జిబిషన్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. కళాశాలకు చెందిన 70 మంది గ్రీన్ క్లబ్ విద్యార్థులు మూడు బృందాలుగా పాల్గొన్నారు. విద్యార్థులు గీసిన పెయింటింగ్‌లు, ఆర్ట్ ఎగ్జిబిషన్ ఆలోచింపజేశాయి. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ బహుమతులు అందజేశారు.

## పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలి

**విశాఖ విద్య:** జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ,జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో శనివారం ఎన్ఏడీ దరి సరస్వతీ విద్యావిహార్ పాఠశాలలో జీసీడీవో డాక్టర్ ఖలీషా బేగం సమన్వయకర్తగా, గోపాలపట్నం ఎంఈవో సోమేశ్వరరావు అధ్యక్షత బాలల హక్కులపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీతారాం మాట్లాడుతూ ప్రహరీ క్లబ్‌ల ఏర్పాటుతో పిల్లల దృష్టి మత్తు వైపు మరలకుండా అవగాహన కల్పించాలన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌తో పాటు బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలల ప్రాంగణాల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ చైర్‌పర్సన్ ఉమారాజ్,సైకాలజిస్ట్ మంత్రి వంశీ, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు,ఐ.సి.డి.ఎస్ అధికారి ఎం.వి.రమణ కుమారి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న గొండు సీతారాం

## పర్యావరణ ప్రేమికులకు వృక్షమిత్ర అవార్డులు

**తాటిచెట్లపాలెం:** వృక్షమిత్ర కన్నం శ్రీనివాసరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఏయూ ఎన్ఎస్ఎస్ భవనంలో వృక్షమిత్ర అవార్డులను ప్రదానం చేశారు. ముఖ్య అతిథి ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిషోర్‌బాబు మాట్లాడుతూ మానవ మనుగడ, సర్వజీవుల సుఖజీవనానికి వృక్ష సంపదను రక్షించాలని పిలుపునిచ్చారు. ఏయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ హరనాథ్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఏటా అనేక మొక్కలు నాటుతున్నారని, చెట్ల పెంపకంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారన్నారు. అనంతరం పలువురు పర్యావరణ ప్రేమికులకు కిషోర్ బాబు చేతుల మీదుగా అవార్డులు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఉదయ్ భాస్కర్, లక్ష్మీకుమారి, ట్రస్ట్ అధ్యక్షుడు కన్నం రమణారావు తదితరులు పాల్గొన్నారు.




అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న నిర్వాహకులు

## నైపుణ్యాభివృద్ధి, నాయకత్వ లక్షణాలపై సదస్సు

**తాటిచెట్లపాలెం:** ఆంధ్రా యూనివర్సిటీలో రాజనీతి శాస్త్రం, పాలనా శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి, నాయకత్వ లక్షణాలు అనే అంశంపై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్రల్ యూనివర్సిటీ తమిళనాడు ప్రొఫెసర్ ఎ.చంద్రమోహన్ ప్రసంగించారు. రాజకీయ, సాంకేతిక, ప్రభుత్వ పాలనా, మానవ, సంభావిత, వ్యక్తిగత, వృత్తి నైపుణ్యాలు, డిజిటల్ టెక్నాలజీ, కమ్యూనికేషన్, క్రియాత్మక మేధస్సు నైపుణ్యాల గురించి వివరించారు. అనంతరం చంద్రమోహన్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఆచార్య పేటేటి ప్రేమానందం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ హరిబాబు, డాక్టర్ రత్నరాజు, డాక్టర్ సత్యనారాయణ, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

## వెంకటాద్రిపై ముగిసిన చాతుర్మాస దీక్షలు



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

**పెందుర్తి:** స్థానిక వెంకటాద్రిపై 40 రోజులుగా జరుగుతున్న చాతుర్మాస దీక్షలు శనివారంతో ఘనంగా ముగిశాయి. ఆఖరి రోజు రామాయణ హవణం, శ్రీనివాస హవణం చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణం వైభవోపేతంగా జరిపారు. శ్రీనివాస హోమం నిర్వహించారు. శాస్త్రోక్తంగా జరిగిన మహాపూర్ణాహుతితో ఉత్సవాలు ముగిసాయి. దాదాపు 500 మంది భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈవో నీలిమ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.